క్లుప్తంగా

వేడుకగా సీతారామ కల్యాణం



ప్రత్యేక అలంకరణలో సీతారాములు

కొనకనమిట్ల: మండలంలోని కాట్రగుంట పంచాయతీ వెంగళపల్లి గ్రామంలో పట్టాభిరామ స్వామి ఆలయంలో బుధవారం సీతారాముల కల్యాణాన్ని భక్తుల కోలాహలం నడుమ వైభవంగా నిర్వహించారు. కల్యాణ ఉభయ దాతలుగా పలువురు దంపతులు వ్యహరించారు. స్వామి వారికి వేదపండితుడు నారాయణశర్మ అర్చనలు, అభిషేకాలు నిర్వహించి కల్యాణ ఘట్టాన్ని జరిపించారు. అనంతరం రైతులు తమ ఎడ్లను పూజించి, స్వామివారికి పానకం బండ్లు కట్టి మొక్కులు చెల్లించారు. భక్తులకు అన్న సంతర్పణ చేశారు. సీతారాముల పట్టాభిషేక ఉత్సవం, వసంతోత్సవం ఘనంగా నిర్వహించారు.

గంజాయి కేసులో ముగ్గురు బైండోవర్

గిద్దలూరు రూరల్: పట్టణంలోని ఏబీఎం పాలేనికి చెందిన ముగ్గురు యువకులను బుధవారం గంజాయి కేసులో బైండోవర్ చేసినట్లు సీఐ కె.సురేష్ తెలిపారు. గంజాయికి అలవాటు పడి జీవితాన్ని నాశనం చేసుకుంటున్నట్లు సమాచారం అందడంతో వారిని తహసీల్దార్ ఎం.అంజనేయరెడ్డి ఎదుట హాజరుపరిచి బైండోవర్ చేసినట్లు చెప్పారు. గంజాయిపై యువత అప్రమత్తంగా ఉండాలని, మత్తు పదార్థాలకు బానిసలైతే జీవితం నాశనం అవుతుందని చెప్పారు. పెడదోవ నడుతున్న యువతపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తున్నామన్నారు.

నేడు మండల పరిషత్ సమావేశం

కొనకనమిట్ల: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఉదయం 10 గంటలకు సర్వసభ్య సమావేశాన్ని ఎంపీపీ మోరబోయిన మురళీకృష్ణయాదవ్ అధ్యక్షతన నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ ఈశ్వరమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామాల అభివృద్ధికి తీసుకోవాల్సిన అంశాలపై అధికారులతో సమీక్షించనున్నట్లు ఎంపీడీఓ పేర్కొన్నారు. అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు తమ ప్రగతి నివేదికలతో సమావేశానికి హాజరుకావాలని స్పష్టం చేశారు. జెడ్పీటీసీ సభ్యుడు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, కో ఆప్షన్ సభ్యులు హాజరు కావాలని కోరారు.

మార్కాపురంలో కార్డన్ సెర్చ్

- 18 బైకులు, 5 ఆటోలు, 3 ఫోన్లు స్వాధీనం



కాలనీ వాసులతో మాట్లాడుతున్న సీఐ సుబ్బారావు, ఎస్సై రాజమోహన్‌రావు

మార్కాపురం: మార్కాపురం పట్టణంలోని ఏకలవ్య కాలనీలో బుధవారం ఉదయం 6 గంటల సమయంలో పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. సరైన పత్రాలు లేని 18 మోటారు సైకిళ్లు, 5 ఆటోలు, పలు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ పండరబోయిన సుబ్బారావు తెలిపారు. అనుమానిత వ్యక్తుల సమాచారాన్ని తెలిపాలని కోరారు. టూటౌన్ ఎస్సై డాక్టర్ యం రాజమోహన్‌రావు, సిబ్బంది పాల్గొన్నారు.

అక్రమ మద్యం పట్టివేత



సీజ్ చేసిన మద్యంతో ఎక్సైజ్ సీఐ కొండారెడ్డి

బేస్తవారిపేట: బెల్ట్ షాపులకు అక్రమంగా తరలిస్తున్న మద్యం బాటిళ్లను బుధవారం సీజ్ చేసినట్లు కంభం ఎక్సైజ్ సీఐ కొండారెడ్డి తెలిపారు. బేస్తవారిపేట మండలంలోని శింగరపల్లెకు చెందిన మహిళ 10 క్వార్టర్ బాటిళ్లు తీసుకెళ్తుండగా అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. బహిరంగ ప్రదేశంలో మద్యం తాగుతున్న మరో వ్యక్తిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

మానసిక ఉల్లాసానికి క్రీడలు దోహదం

పెద్దారవీడు: క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదపడతాయని ప్రిన్సిపాల్ కర్తార్‌సింగ్ గుర్జర్ అన్నారు. మండలంలోని రాజంపల్లి సమీపం కేంద్రియ విద్యాలయంలో హైదరాబాద్ రిజనల్ లెవల్లో బాల బాలికలకు అండర్ 14, 17, 19 విభాగాలకు టేబుల్ టెన్నిస్ పోటీలు బుధవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో నైపుణ్యం చాటాలని, జాతీయ స్థాయి క్రీడల్లో రాణించాలని ఆకాంక్షించారు. క్రమశిక్షణ, ప్రణాళికాబద్ధంగా క్రీడలపై ఏకగ్రతతో ఆడితే ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చన్నారు. పోటీల్లో 17 కేంద్రియ విద్యాలయ బాలబాలికలు హాజరయ్యారు. ఉపాధ్యాయులు, పీడీలు పాల్గొన్నారు.

ఇదిగో ఇలాగా.. ప్రయాణం సాఫీగా..

- రోడ్లపైకి రోజూ వేల సంఖ్యలో ద్విచక్ర వాహనాలు, ఫోర్‌వీలర్లు
- వేసవిలో జాగ్రత్తలు పాటించాలని మెకానిక్‌ల సూచన
- అప్రమత్తంగా లేకపోతే వాహనాలు బుగ్గిపాలు

మార్కాపురం:

దోర్నాల–శ్రీశైలం ఘాట్ రోడ్డు.. వేగంగా వెళ్తున్న ఇన్నోవా కారు ఒక్కసారిగా హీటెక్కింది. డ్రైవర్ అప్రమత్తంగా వ్యవహరించి కారులోని ప్రయాణికులను హుటాహుటిన కిందకు దించి కారును రోడ్డు మార్జిన్‌లో నిలిపాడు. ఇంతలోనే కారు ఇంజిన్ నుంచి మంటలు ఎగసిపడటంతో పూర్తిగా కాలిపోయింది. గుంటూరుకు చెందిన భక్తులు శ్రీశైలం వెళ్తుండగా చిన్నారుట్ల వద్ద ఈ ప్రమాదం జరిగింది.

☛ ఫిబ్రవరి 24న మార్కాపురం పట్టణంలోని తర్లుపాడు రోడ్డులో ఓ దుకాణం ముందు నిలిపి ఉంచిన స్కూటర్ ఒక్కసారిగా మంటల్లో కాలిపోయింది. తర్లుపాడుకు చెందిన ఓ రైతు వ్యక్తిగత పనిపై మార్కాపురం వచ్చిన కాసేపటికే స్కూటర్‌కు మంటలు అంటుకున్నాయి. తీవ్రమైన ఎండల నేపథ్యంలో వాహనాల యజమానులు తగిన జాగ్రత్తలు పాటించకపోతే షార్ట్‌సర్క్యూట్‌తో అగ్నిప్రమాదాలు సంభవించే అవకాశం ఉందని మెకానిక్‌లు హెచ్చరిస్తున్నారు. జిల్లాలో రోడ్లపై రోజూ 20 వేలకు పైగా బైకులు, నాలుగు వేలకు పైగా ఫోర్ వీలర్లు తిరుగుతున్నాయి. అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్న దృష్ట్యా కనీస జాగ్రత్తలు తీసుకుంటే ప్రయాణం సాఫీగా సాగుతుందని, ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని మెకానిక్‌లు చెబుతున్నారు. పెట్రోల్, డీజిల్ కొట్టించుకునే సమయంలో నిర్లక్ష్యంగా ఉండి ట్యాంకర్ మూత సరిగా పెట్టకపోతే ఎండ తీవ్రతకు ఇంధనం ఆవిరి కావడంతోపాటు వాహనాలు అగ్ని ప్రమాదానికి గురయ్యే అవకాశం కూడా లేకపోలేదు.

ద్విచక్ర వాహనాల విషయంలో జాగ్రత్తలు

☛ వీలైనంత వరకు ద్విచక్ర వాహనాలను నీడలో పార్కింగ్ చేయాలి.



కాలిపోతున్న ద్విచక్ర వాహనం(ఫైల్)

☛ ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల మధ్య వాహనాల్లో పెట్రోల్, డీజిల్ కొట్టించకపోవడమే మంచిది

☛ 70 కిలోమీటర్లు ప్రయాణం చేసిన తర్వాత వాహనాన్ని 10 నిమిషాలు ఆపి ఉంచాలి. దీని వల్ల ఇంజిన్ చల్లబడి లోపల వైర్లు షార్ట్‌సర్క్యూట్ కాకుండా ఉంటుంది.

☛ వాహనాలు పార్క్ చేసేటప్పుడు బండిపై కవర్ కచ్చితంగా ఉంచాలి.

☛ మధ్యాహ్న సమయంలో తీవ్రమైన ఎండ వేడి వల్ల టైర్లు పంక్చర్ అయ్యే ప్రమాదం ఉంది. తద్వారా బండి కంట్రోల్ తప్పి ప్రమాదానికి గురవుతుంది. కాబట్టి ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలి.

☛ వేసవిలో ఎండల తీవ్రత దృష్ట్యా 20 రోజులకు ఇంజిన్ ఆయిల్ చెక్ చేయించుకోవాలి.

☛ రోడ్డుపై ప్రయాణించేటప్పుడు ఎండ వేడి వల్ల రబ్బర్లు అంటుకుపోవటం, కాలిపోవడం జరుగుతుంది. కాబట్టి బ్రేక్‌లు ఎప్పటికప్పుడు చెక్ చేసుకోవాలి.

అప్రమత్తంగా లేకపోతే అంతే సంగతులు



వేసవిలో చాలా మంది టూర్లకు వెళ్తుంటారు. ఏ మాత్రం అజాగ్రత్తగా ఉన్నా ఎండ వేడికి వాహనాలు తగలబడిపోతాయి. దీని వల్ల విలువైన జీవితం కోల్పోవాల్సి వస్తుంది. ప్రతి వాహనానికి ఇన్సూరెన్స్ చేయించుకోవాలి. మెకానిక్‌ల వద్దకు వెళ్తే చార్జ్ ఇవ్వాల్సి వస్తుందని చాల మంది వాహనాలు బాగోలేకపోయినా వెళ్తుంటారు. ఇది చాలా ప్రమాదకరం. దయచేసి అలా చేయవద్దు. ఉష్ణోగ్రతలు పెరిగినప్పుడు వాహనాలు అధిక పీడనానికి గురవుతాయి. ఎండ వేడి ఎక్కువగా ఉంటే టైర్లు పేలిపోయే ప్రమాదం ఉంది. ఒక్కోసారి షార్ట్ సర్క్యూట్ వల్ల వాహనాలు కాలిపోతాయి. వేసవిలో ప్రతి 15 రోజులకు ఒకసారి వాహనాలను చెక్ చేయించుకోవాలి.

– షాబుద్దీన్, మెకానిక్, మార్కాపురం

ఫోర్‌వీలర్లకు ఈ జాగ్రత్తలు తప్పనిసరి

- వేసవిలో సాధారణంగా కుటుంబ సభ్యులతో లాంగ్ టూర్ వెళ్తుంటారు. రోజుకు కనీసం 300 కిలోమీటర్లకు పైగా ప్రయాణిస్తారు. ఇటువంటి సమయంలో కారు రేడియేటర్‌లో నీటిని సరిచూసుకోవాలి.
- వేసవి తీవ్రత దృష్ట్యా ప్రతి 15 రోజులకు ఒకసారి ఇంజిన్ ఆయిల్ చెక్ చేసుకోవాలి.
- లాంగ్ టూర్ వెళ్లేటప్పుడు టైర్లలో గాలి చెక్ చేసుకోవాలి. లైట్లు, హారన్, టైర్లు, బ్రేక్‌లు పరిశీలించడం మంచిది.
- ఎల్.పి.జి. ఉన్న వాహనాలను వేసవిలో వాడకపోవటం శ్రేయస్కరం.

చిన్నారుల ఆరోగ్యంపై దృష్టి సారించాలి



గర్భిణులకు సామూహిక సీమంతం చేస్తున్న సీడీపీఓ తదితరులు



మార్కాపురంలో ర్యాలీలో పాల్గొన్న ఐసీడీఎస్ సిబ్బంది

బేస్తవారిపేట: అంగన్‌వాడీ కార్యకర్తలు చిన్నారుల ఆరోగ్యంపై దృష్టి సారించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పి.విజయలక్ష్మి పేర్కొన్నారు. బుధవారం జేసీ అగ్రహారంలో పోషణ్ పక్వాడా కార్యక్రమం నిర్వహించారు. సీడీపీఓ మాట్లాడుతూ.. గర్భిణులు, బాలింతలు, చిన్న పిల్లలు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందించే సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గర్భిణులు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలని, ఐరన్, ఫోలిక్‌యాసిడ్, విటమిన్ మాత్రలు, పౌష్టికాహారం తీసుకోవాలని చెప్పారు. పలువురు గర్భిణులకు సామూహిక సీమంతం నిర్వహించారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎం శిరీషా, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

గిద్దలూరు రూరల్: మండలంలోని కె.ఎస్.పల్లె అంగన్‌వాడీ సెంటర్‌లో పోషణ్ పక్వాడాపై బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సీడీపీఓ బి.జ్యోతి మాట్లాడుతూ.. గర్భిణులు ప్రసవించిన రెండేళ్ల వరకు వారి ఆరోగ్యాన్ని పర్యవేక్షించాలని సూచించారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం అందించాలని చెప్పారు. బిడ్డ పుట్టిన ఆరు నెలల వరకు తల్లిపాలు పట్టించాలని స్పష్టం చేశారు. తద్వారా పిల్లల్లో రోగ నిరోధక శక్తి పెరుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పోషక విలువలపై అవగాహన ర్యాలీ

మార్కాపురం టౌన్: ఆహారంలో ఏడు రకాల పోషకాలు ఉండేలా చూసుకోవాలని సీడీపీఓ సుశీలాదేవి పేర్కొన్నారు. పిండి పదార్థాలు, కొవ్వు పదార్థాలు, మాంసకృత్తులు, విటమిన్లు, పీచు పదార్థం, ఖనిజ లవణాలు, నీరు ఉండే ఆహారాన్ని తీసుకోవడం ద్వారా ఆరోగ్యంగా ఉండవచ్చని చెప్పారు. బుధవారం ఏకలవ్య కాలనీ, ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో అవగాహన ర్యాలీ నిర్వహించి మాట్లాడారు. సకాలంలో పిల్లలకు టీకాలు వేయించాలని సూచించారు. చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు బుజ్జి, అరుణ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.



కేఎస్ పల్లెలో మాట్లాడుతున్న సీడీపీఓ జ్యోతి

అగ్ని ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి



కంభంలో అవగాహన కల్పిస్తున్న ఫైర్ సిబ్బంది



మార్కాపురంలో అవగాహన కల్పిస్తున్న ఫైర్ ఆఫీసర్ రామకృష్ణ

గిద్దలూరు రూరల్: అగ్ని ప్రమాదాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని స్థానిక అగ్నిమాపకశాఖ అధికారి హరిబాబు సూచించారు. అగ్నిమాపక వారోత్సవాలల్లో భాగంగా పట్టణంలోని నరవ రోడ్డులోగల నందిని అపార్ట్‌మెంట్ ఆవరణలో బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అగ్ని ప్రమాదాల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అగ్నిమాపకశాఖ అనుమతి మేరకు అపార్ట్‌మెంట్లు, స్కూల్స్, రెస్టారెంట్స్, సినిమా థియేటర్లు, వైద్యశాల భవంతులు నిర్మించుకోవాలని స్పష్టం చేశారు.. ప్రధానంగా వేసవి కాలంలో అగ్నిప్రమాదాలపై మరింత అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. మహిళలు ఇంట్లో వంట చేసే సమయంలో గ్యాస్ సిలిండర్ల వాడకంలో జాగ్రత్తలు పాటించాలన్నారు. కార్యక్రమంలో అగ్నిమాపకశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

కంభం: అగ్నిమాపక వారోత్సావాల్లో భాగంగా బుధవారం స్థానిక అర్బన్ కాలనీలో ఫైర్ సిబ్బంది అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అగ్ని ప్రమాదం సంభవించిన వెంటనే ఆందోళన పడకుండా ఆలోచనతో వ్యవహరించే పద్ధతులను ప్రయోగాత్మకంగా వివరించారు. గ్యాస్ సిలిండర్ వినియోగం విషయంలో మహిళలు అప్రమత్తంగా ఉండాలని, 6 నెలలకోసారి గ్యాస్ పైపు సరిచూసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో ఫైర్ ఆఫీసర్ పీడీ చౌదరి, సిబ్బంది పాల్గొన్నారు.

మార్కాపురం టౌన్: అపార్టుమెంట్లలో నివసించేవారు అగ్నిప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలని మార్కాపురం ఫైర్ ఆఫీసర్ ఆర్.రామకృష్ణ సూచించారు. వారోత్సవాల్లో భాగంగా బుధవారం ఆయన వివిధ అపార్టుమెంట్లకు వెళ్లి మహిళలు, ప్రజలకు అగ్నిప్రమాదాల నివారణ చర్యలపై అవగాహన కల్పించారు. గ్యాస్ సిలిండర్ పేలడం, విద్యుత్ షార్ట్ సర్క్యూట్ అయిన సందర్భాల్లో ఎలా వ్యవహరించాలో ప్రయోగాత్మకంగా వివరించారు. అగ్ని ప్రమాద సమాచారాన్ని వెంటనే ఫైర్ ఆఫీస్‌కు తెలియజేయాలని సూచించారు.



అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

నేడు డయల్ యువర్ డీఎం

పొదిలి: ఆర్టీసీ ప్రయాణికుల సమస్యలపై గురువారం డయల్ యువర్ డిపో మేనేజర్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు డీఎం ఒక ప్రకటనలో తెలిపారు. డిపో పరిధిలోని మండలాల ప్రయాణికులు వారి సలహాలు, సూచనలు, సమస్యలు తెలియచేయాలని కోరారు. సాయంత్రం 4–5 గంటల మధ్యలో 9959225700కు ఫోన్ చేయాలని సూచించారు.

నూర్‌బాషాలకు సముచిత స్థానం కల్పించాలి

తర్లుపాడు: రాష్ట్రంలో నూర్‌బాషాలకు నామినేటెడ్ పదవుల్లో సముచిత స్థానం కల్పించాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నూర్‌బాషా(దూదేకుల) యువజన సంక్షేమ సంఘ అధ్యక్షుడు డీపీ మస్తాన్ బుధవారం ఓ ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. 4 ఎమ్మెల్యేలు, వక్ఫ్‌బోర్డు చైర్మన్, మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్, మంత్రి పదవితోపాటు ప్రభుత్వ సలహాదారు పదవిని ముస్లిం మైనార్టీలకు కేటాయించి, నూర్‌బాషాలను మాత్రం పక్కనపెట్టారని విమర్శించారు. ముస్లిం మైనార్టీలకు కేటాయించే నామినేటెడ్ పదవుల్లో కనీసం మూడింటితోపాటు డైరెక్టర్ పదవుల్లో 30 శాతం నూర్‌బాషాలకు అవకాశం కల్పించాలని కోరారు. ప్రకాశం జిల్లాతోపాటు రాయలసీమ ప్రాంతంలో అధికంగా ఉన్న నూర్‌బాషాలపై చిన్నచూపు చూడటం సరికాదని పేర్కొన్నారు.



ఉద్యోగాలకు ఎంపికైన వారిని అభినందిస్తున్న మాజీ మంత్రి సురేష్

విద్యార్థులకు మాజీ మంత్రి సురేష్ అభినందన

మార్కాపురం: క్యాంపస్ ప్లేస్‌మెంట్‌లో జార్జి ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు 8 మంది సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలకు ఎంపిక కావడంతో మాజీ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ అభినందించారు. ప్రఖ్యాత అంతర్జాతీయ సాఫ్ట్‌వేర్ కంపెనీ గ్లెన్‌వుడ్ సంస్థ బుధవారం కళాశాలలో నిర్వహించిన ప్లేస్‌మెంట్ ఇంటర్వ్యూలో 8 మంది విద్యార్థులు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ రాజబాబు తెలిపారు. కార్యక్రమంలో డీన్ మస్తానయ్య, హెచ్‌ఓడీలు సాధునాయక్, ఆది సత్యనారాయణ, డానియేల్, సూర్య, సాయిూష, స్వాతి తదితరులు పాల్గొన్నారు.

టాలెంట్ టెస్ట్‌లతో విద్యార్థుల్లో మేధోశక్తి

కొనకనమిట్ల: టాలెంట్ టెస్ట్‌ల ద్వారా విద్యార్థుల్లో మేధోశక్తి పెరుగుతుందని ఎంఈఓ–2 బరిగె నరసింహరావు పేర్కొన్నారు. బుధవారం మండలంలోని మర్రిపాలెం జెడ్పీ ఉన్నత పాఠశాలలో వివిధ స్కూళ్లకు చెందిన 5వ తరగతి విద్యార్థులకు హెచ్‌ఎం సూరె నాగేశ్వరరావు పర్యవేక్షణలో టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. మొదటి స్థానంలో ఎదురాళ్లపాడు పాఠశాలకు చెందిన కృష్ణారెడ్డి, రెండో స్థానంలో కె.నాగంపల్లికి చెందిన ఎం.పావని, మూడో స్థానంలో వద్దిమడుగు పాఠశాలకు చెందిన బి.మార్షల్, ఎ.లక్ష్మీ మేఘన నిలిచారు. వీరికి బహుమతులను హెచ్‌ఎం నాగేశ్వరరావు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



బహుమతులు సాధించిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

విద్యుత్ అదనపు లోడ్ రెగ్యులరైజ్‌పై రాయితీ

మార్కాపురం: విద్యుత్ వినియోగదారులు తాము వాడుతున్న అదనపు విద్యుత్ లోడును రెగ్యులరైజ్ చేసుకునేందుకు 50 శాతం సబ్సిడీ అందిస్తున్నామని మార్కాపురం విద్యుత్ శాఖ ఏడీఈ సియానాయక్ తెలిపారు. కిలో వాట్ విద్యుత్ లోడుకు సాధారణంగా రూ.2250 చెల్లించాలని, సబ్సిడీపై రూ.1250 చెల్లిస్తే సరిపోతుందని స్పష్టం చేశారు. 2కిలో వాట్లకు సబ్సిడీపోను రూ.2,450, 3 కిలో వాట్లకు రూ.3650, 4 కిలోవాట్లకు రూ.4850, 5 కిలోవాట్లకు రూ.6050 చెల్లిస్తే సరిపోతుందని పేర్కొన్నారు. ఈ అవకాశం జూన్ 30 వరకు ఉందని తెలిపారు. మరిన్ని వివరాలకు నేరుగా విద్యుత్‌శాఖ కార్యాలయంలో లేదా విద్యుత్ సిబ్బందిని సంప్రదించాలని, ఆన్‌లైన్ మోసాలకు గురికావద్దని స్పష్టం చేశారు.



వివరాలు తెలియజేస్తున్న సియా నాయక్

సాంకేతిక సమస్యలకు పరిష్కారం అభినందనీయం



కార్యక్రమంలో పాల్గొన్న హెచ్‌ఓడీలు, విద్యార్థులు

మార్కాపురం: ఇంజినీరింగ్ విద్యార్థులు తాము ఎదుర్కొంటున్న సాంకేతిక సమస్యలకు ఆవిష్కరణాత్మక పరిష్కారాలు కనుగొనడం అభినందనీయమని కిట్స్ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.కృష్ణారెడ్డి పేర్కొన్నారు. కిట్స్‌లో ఎలక్ట్రానిక్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన డిజైన్ థింకింగ్ అండ్ ఇన్నోవేషన్ ల్యాబ్ ఆధ్వర్యంలో విద్యార్థులు సాధించిన ప్రగతిని పురస్కరించుకుని బుధవారం విజయోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఇన్నోవేషన్ అంటే సిద్ధాంతం కాదని, అనుభవంతో కూడిన పరిష్కారాలను రూపొందించడమని ప్రిన్సిపాల్ పేర్కొన్నారు. విద్యార్థులు రూపొందించిన స్మార్ట్ హెల్త్ మానిటరింగ్ సిస్టమ్, గ్రామీణ మౌలిక వసతులపై డిజిటల్ సొల్యూషన్లను పరిశీలించారు. సమాజానికి ఉపయోగపడే పరిశోధనలు మరిన్ని చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏఓ ప్రభాకర్, ఎన్‌ఎస్‌ఎస్ పీఓ అనీల్‌కుమార్, హెచ్‌ఓడీలు పాల్గొన్నారు.

మంచినీటి పైప్‌లైన్‌కు లీకేజీలు





పైపులైన్ లీకేజీలతో బురదమయంగా మారిన రహదారులు

కొమరోలు: మండలంలోని మల్లారెడ్డి పల్లె గ్రామంలో మంచినీటి పైపులైన్ అడుగడుగునా లీకులమయంగా మారింది. దశాబ్దం క్రితం వేసిన ఈ మంచినీటి పైపులైన్‌కు తరచూ లీకేజీలు ఏర్పడుతున్నాయి. మంచినీరు వదిలిన ప్రతిసారీ లీకేజీలు ఉన్న ప్రాంతాల్లో రహదారులన్నీ బురదమయంగా మారుతున్నాయి. నీరు అలాగే నిల్వ ఉండటంతో దోమలు విజృంభిస్తున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీ అధికారులకు సమస్య తెలిపినప్పటికీ పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి పైప్‌లైన్ లీకేజీలను అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.